క్లుప్తంగా

అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే టీజేఆర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, పార్టీలోని వివిధ స్థాయి నాయకులతో పాటు పలు శాఖల అధికారులతో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సోమవారం సమీక్ష నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగనన్న వంటి కార్యక్రమాలతో పాటు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవీంద్రరెడ్డి

ఈతముక్కల (కొత్తపట్నం): వేసవిలో దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు బాగా ఉపయోగపడతాయని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. ఈతముక్కల అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బందారు రుక్మిణమ్మ, మేడికొండ అర్జున్‌రావు, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, నితిన్, క్రాంతి, గంటా శంకర్, ఎం.మోషే తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం పీహెచ్‌సీకి మందుల అందజేత



మందులు అందజేస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: స్థానిక పీహెచ్‌సీకి ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తన సొంత నిధులతో సోమవారం మందులు అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ వైష్ణవి, ఎంపీడీవో పి.సుజాత, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

చీమకుర్తి: రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంప్ కార్యాలయంపై టీడీపీ నాయకులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని ఒంగోలు 40వ డివిజన్ కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పేర్నమిట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు యర్రగొండపాలెం పర్యటనలో టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టడం వలనే మంత్రి సురేష్ కార్యాలయంపై దాడి చేశారన్నారు. ఇలాంటి దాడులు మళ్లీ జరిగితే సహించేది లేదన్నారు.

ఘనంగా బూచేపల్లి విద్యాధర రెడ్డి పుట్టినరోజు వేడుకలు

చీమకుర్తి: జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మనుమడు, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి తనయుడు బూచేపల్లి విద్యాధరరెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం చీమకుర్తిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. విద్యార్థినులందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కంజుల ప్రతాప్‌రెడ్డి, వై.జనార్దన్‌రెడ్డి, షేక్ ఖాదర్‌బాషా, ఏ రామబ్రహ్మం, స్థానికులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, తదితరులు

పంచాయతీలను అభివృద్ధి చేసుకుందాం

- ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి
- ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



నాగులుప్పలపాడు: ఘట్టమనేని అశోక్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



ఆలూరు పంచాయతీకి పురస్కారం అందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



కొత్తపట్నంలో అవార్డులు అందజేస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, రవీంద్రరెడ్డి, సుజాత

ఒంగోలు రూరల్: ఒంగోలు మండలంలోని పంచాయతీలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. కార్యదర్శులు అంకితభావంతో పనిచేయడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఒంగోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈవోఆర్డీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం దూపాడు, రాపర్ల ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయని, రానున్న సంవత్సరంలో జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో తప్పనిసరిగా ఒంగోలు మండల పంచాయతీలు ఉత్తమంగా నిలవాలని అన్నారు. ర్యాంకుల ద్వారా ఎంపికైన వలేటివారిపాలెం, దేవరంపాడు, దేవరంపాడు హరిజనవాడ, మండువవారిపాలెం, చింతాయగారిపాలెం, చేజర్ల, బొద్దులూరివారిపాలెం, కరవది పంచాయతీల కార్యదర్శులకు ఎంపీపీ పల్లపోలు అవార్డులు అందజేశారు.

కరవది, తదితర గ్రామాల్లో...

మండలంలోని కరవది గ్రామ సచివాలయం ఆవరణలో నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవానికి సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, ఈవోఆర్డీ పూర్ణచంద్రరావు పాల్గొని మాట్లాడారు. కార్యదర్శి-2 వేమా శ్రీలక్ష్మి, సచివాలయ సిబ్బంది, 32 మంది గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఆయా గ్రామాల కార్యదర్శులు నిర్వహించారు. గుండాయపాలెంలో ఆశీర్వాదం, దేవరంపాడులో సురేష్‌బాబు, ఉలిచి, చేజర్లలో కె.శ్రీనివాసరావు, వలేటివారిపాలెంలో రంగారెడ్డి, దశరాజుపల్లెలో కళ్యాణి, యరజర్లలో రామకృష్ణ, సర్వేరెడ్డిపాలెంలో రాంమోహన్‌రావు, చింతాయగారిపాలెంలో స్వప్న, బొద్దులూరివారిపాలెంలో భారతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: సచివాలయాల ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో ప్రజల వద్దకే పాలన సాగుతోందన్నారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకోవడం గొప్పకాదని, ప్రతి పంచాయతీలో రోడ్లను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు ఆక్రమిస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం చెందారు. అనంతరం 9 రకాల సేవా కార్యక్రమాలో ప్రభుత్వం గుర్తించిన 15 పంచాయతీలకు మండల స్థాయిలో అవార్డులు పంపిణీ చేశారు. వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మిట్నసల శాంతారావు, రామలింగం వెంకట్రావు, పీఆర్ ఏఈ శేషగిరిరావు, ఏపీఎం షేక్ రజియా సుల్తాన్‌బేగం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలూరు పంచాయతీకు ఉత్తమ పురస్కారం

జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ పురస్కారం అవార్డు కొత్తపట్నం మండలం ఆలూరు పంచాయతీకి దక్కింది. ఒంగోలు ప్రకాశం భవనంలో సోమవారం నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవంలో ఆలూరు సర్పంచ్ పూనూరు మాధవి, శైలేష్‌కు సామాజిక భద్రత కలిగిన గ్రామ పంచాయతీ విభాగంలో కలెక్టర్ దినేష్‌కుమార్ పురస్కారాన్ని అందజేశారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పంచాయతీరాజ్ వారోత్సవాలలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, ఎంపీడీవో కే సీతారామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం గ్రామాల సంపూర్ణాభివృద్ధికి దోహదపడిందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావును కార్యదర్శులు, ఎంపీడీవో ఆధ్వర్యంలో శాలువా కప్పి సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

మండలంలోని ఆర్.ఎల్.పురం పంచాయతీకి చెందిన పారిశుధ్య కార్మికులను సర్పంచ్ పుల్లగూర రమణమ్మ శాలువాలతో సోమవారం ఘనంగా సత్కరించారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామంగా వినోదరాయునిపాలెం ఎంపిక...

నాగులుప్పలపాడు: స్వయం సంవృద్ధి, మౌలిక సదుపాయాలతో కూడిన గ్రామంగా మండలంలోని వినోదరాయునిపాలెం గ్రామ పంచాయతీకి జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి అందినట్లు గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్ తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా వినోదరాయునిపాలెం గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్‌బాబు అవార్డు, సన్మానం, ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌ను ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్టారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంచర్ల సుధాకర్, సర్పంచ్‌లు పల్లెర్ల అంజిరెడ్డి, కొండయ్య, రమేష్, మురళి, ఎంపీటీసీ పాద పవన్ అభినందించారు.

పంచాయతీలు అభివృద్ధి బాటలో నడవాలి...

దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలు మరింత అభివృద్ధిలోకి రావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని నాగులుప్పలపాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్టారెడ్డి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 9 విభాగాలలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన గ్రామాల ప్రతినిధులను అభినందించారు.

క్రీడాకారులకు ప్రశంస...

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో ఆ శాఖ నాగులుప్పలపాడు మండల జట్టు ద్వితీయ స్థానంలో గెలుపొందడంతో క్రీడాకారులను ఎంపీపీ దంపతులు నల్లమలపు అంజమ్మ కృష్టారెడ్డి అభినందించారు.

వలంటీర్‌కు నియామకపత్రాల అందజేత...

మండల వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఇటీవల నియమితులైన వారికి ఎంపీపీ అంజమ్మ కృష్టారెడ్డి చేతుల మీదుగా సోమవారం నియామకపత్రాలు అందజేశారు.



చింతాయగారిపాలెం కార్యదర్శికి అవార్డు అందజేస్తున్న ఎంపీపీ పల్లపోలు



నాగులుప్పలపాడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నల్లమలపు అంజమ్మ కృష్టారెడ్డి



ఆర్.ఎల్.పురంలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్ రమణమ్మ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

మే 5న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

- కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక కేశవస్వామిపేటలో శ్రీ సీతా సమేత రామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని మే 5వ తేదీ నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత కరపత్రాలను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం ఉదయం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి కృషిచేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులను అభినందించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ దుగ్గిరెడ్డి ఆంజనేయులురెడ్డి మాట్లాడుతూ మే 3, 4, 5 తేదీల్లో మూడు రోజులపాటు త్రయాహ్నిక దీక్షతో నూతన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్, శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథం, సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, ఆంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు పిల్లి హరినారాయణరెడ్డి, కోట రాంబాబు గుప్తా, బత్తుల ప్రమీల, సూపర్‌బజార్ డైరెక్టర్ వల్లెపు మురళి, షేక్ అజీజ్, వైఎస్సార్ సీపీ నాయకులు కటారి శంకర్, రాయని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి



ఇనమనమెళ్లూరు సర్పంచ్ ఏడుకొండలును సన్మానించి అవార్డు అందిస్తున్న ఎంపీపీ వాకా

మద్దిపాడు: గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తూ మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామ పంచాయతీకి 7 అవార్డులు, మద్దిపాడుకు 6 అవార్డులు, బసవన్నపాలేనికి 3 అవార్డులు, మిగిలిన పంచాయతీలకు ఒకటిరెండు అవార్డులు వచ్చినట్లు ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తెలిపారు. ప్రకటించిన అవార్డులను సంబంధిత గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతుల మీదుగా అందిస్తూ వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, నాయకులు పాల్గొన్నారు.

27న శ్రీ హర్షిణి కాలేజీలో క్యాంపస్ డ్రైవ్

ఒంగోలు సబర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ శ్రీ హర్షిణి డిగ్రీ కాలేజీలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఆ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటలకు క్యాంపస్ డ్రైవ్ ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏపీఐటీఏ, ఆర్‌ఐవో-ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్‌బీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ వర్కర్లకు నిర్లక్ష్యం తగదు

- సూపర్‌వైజర్, సీడీపీవో ఎందుకు పర్యవేక్షించడం లేదు
- అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



అంగన్‌వాడీ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

మద్దిపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయకుండా అంగన్‌వాడీ వర్కర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే సూపర్‌వైజర్, సీడీపీవో ఎందుకు పర్యవేక్షించడం లేదంటూ ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అంగన్‌వాడీ సెంటర్లను అభివృద్ధి చేస్తూ నిధులు ఖర్చుచేస్తుంటే సిబ్బంది, అధికారులపై మాత్రం తరచూ ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. మద్దిపాడులోని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ వర్కర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం 1, 2, 3, 4లను పరిశీలించగా, రికార్డులలో ఉన్న సరుకుకు, స్టాక్‌లో ఉన్న సరుకుకు వ్యత్యాసం ఉండటంతో గర్భిణులు బాలింతల రికార్డులను పద్మావతి పరిశీలించారు. ఈ క్రమంలోనే ఆమె ఎదురుగానే అంగన్‌వాడీ వర్కర్‌తో ఒక యువతి తమకు సక్రమంగా గుడ్లు ఇవ్వడం లేదని వాదనకు దిగడం గమనార్హం. 3వ సెంటర్‌లో పిల్లలకు గుడ్లు, భోజనం, పాలు అందించడం లేదని 4వ సెంటర్లో భోజనం వండకపోగా కనీసం మంచినీళ్లు కూడా లేని పరిస్థితిని ఉందని పద్మావతి తెలిపారు. చిన్నారులు ఆకలి అంటూ అడగడాన్ని గమనించిన ఆమె.. భోజనం ఎందుకు వండలేదని ప్రశ్నించగా, రోజూ వండుతున్నామని, ఈ రోజు సెంటర్ సమీపంలోని వ్యక్తి మృతి చెందినందున వండలేదని ఆయా చెప్పడంతో మండిపడ్డారు. ప్రతి రోజూ 16 మంది చిన్నారులకు హాజరు వేస్తున్నారని, కానీ సోమవారం 8 మంది మాత్రమే ఎందుకు హాజరయ్యారని అడగ్గా, ఆయా మౌనంగా ఉండిపోయింది. అంగన్‌వాడీ కేంద్రాలను రోజూ తనిఖీ చేయకపోవడం వలనే పిల్లలకు అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ సూపర్‌వైజర్, సీడీపీవోపై పద్మావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలో కనీసం సెంటర్‌లో మంచినీరు కూడా అందుబాటులో ఉంచకపోవడంపై ధ్వజమెత్తారు. ఆహారం, నీళ్లు అందించకపోవడం బాలల హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, దీనిపై శిశుసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేస్తామని పద్మావతి అన్నారు. పీపీ 1, పీపీ 2 బోధనకు సంబంధించిన పుస్తకాలను అటకెక్కించారని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలలో అటెండెన్స్‌లో అవకతవకలు ఉన్నాయని గుర్తించి హెచ్‌ఎంకు తగిన ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అంతర జిల్లాలకు బదిలీ చేయిస్తామని ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, మహిళా సంరక్షణ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తులకు గడువు పెంపు

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు ప్రభుత్వ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు అర్హులైన బాలికల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ ప్రియదర్శిని తెలిపారు. గతంతో దరఖాస్తులకు ఏప్రిల్ 24వ తేదీ వరకు గడువుందని తెలిపిన క్రమంలో.. ప్రస్తుతం గడువును పెంచినట్లు ఆమె పేర్కొన్నారు. అభ్యర్థులు 2021-23 విద్యా సంవత్సరంలో మూడు, నాలుగు తరగతులు చదివి ఉండాలని, ఉమ్మడి ప్రకాశం గ్రామీణ ప్రాంత బాలికలు మాత్రమే అర్హులని వెల్లడించారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఐదో తరగతిలో 80 సీట్లు, 6వ తరగతిలో బీసీ ఏ 1, 7వ తరగతిలో ఎస్సీ బాలికలు-1, 8వ తరగతిలో బీసీ బీ 1 చొప్పున ఖాళీలు ఉన్నట్లు వివరించారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మే 20వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

భావితరాలకు ప్రకృతి వ్యవసాయం అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు

ఒంగోలు రూరల్: రానున్న తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ఇప్పటి నుంచే పూర్తిగా ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ చూపాలని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ వాకా మాధవి అన్నారు. ఒంగోలు మండలంలోని గుత్తికొండాయపాలెంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం వారు 2023-24 వార్షిక ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకా మాధవి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులు అత్యంత శక్తివంతమైనవి వాడటం వలన వాటి అవశేషాలు పండించిన పంటలో, దిగుబడిలో చేరి అవి తీసుకున్న మానవ శరీరానికి దీర్ఘకాలంలో అంతుచిక్కని రోగాలు వస్తాయన్నారు. గతంలో 80 సంవత్సరాలున్న జీవితకాల పరిమితి ప్రస్తుతం 60 సంవత్సరాలకు కుదించుకుపోయిందన్నారు. ఈ సందర్భంగా వార్షిక ప్రణాళిక ఏ విధంగా తయారు చేయాలి, ఏయే అంశాలు తయారుచేయాలన్న విషయాన్ని వివరించారు. రైతులంతా భవిష్యత్తు జీవనం ఆరోగ్యకరంగా ఉండేందుకు ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. గ్రామ మహిళా సంఘాలు ముందుకొచ్చి ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా తొలకరి జల్లుల కంటే ముందుగా కనీసం 30 రకాల విత్తనాలతో గుళికల విధానం ద్వారా విత్తనాలు చల్లితే ఆయా పొలాల్లో చిరుజల్లులు పడిన వెంటనే మొలకలు వస్తాయన్నారు. అలా వచ్చిన పంటను రైతులు 45 రోజుల తర్వాత గొర్రెల మేతగా, పశువుల మేతగా వాడుకోవచ్చన్నారు. కలియదున్నడం వలన భూమిలో కలిసిపోయి నత్రజని, తదితర మూలకాలు భూమిలో చేరి పచ్చిరొట్టగా వాడుకోవచ్చన్నారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ రవిచంద్ర, షేక్ రజియా, అమరవాణి, సుభాషిణి, రైతులు పాల్గొన్నారు.

నేడు శంకర జయంతి

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వైశాఖ శుద్ధ పంచమి రోజైన మంగళవారం శంకర జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో వేంచేసియున్న జగద్గురు ఆదిశంకరాచార్యస్వామి, శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వార్లకు ఉదయం 6 గంటల నుంచి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అన్నపూర్ణాదేవి అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జగద్గురు ఆది శంకరాచార్యస్వామి సహస్రనామ ఆలయ ఉత్సవం జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.